క్లుప్తంగా

దివ్యాంగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజయ్య

హసన్‌పర్తి: దివ్యాంగుల సేవా సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన గొల్లే రాజయ్య నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి శుక్రవారం ప్రకటించారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యా విభాగం (ఎడ్యుకేషన్) పరిశోధకుడు వెంకటేశ్వర్లు భూక్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆఫ్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ వాల్యూస్ అండ్ వాల్యూ ఓరియంటేషన్ అమాంగ్ టీచర్స్ ఆఫ్ ట్రైబల్ కమ్యూనిటీస్ ఇన్ ప్రైమరీ అండ్ సెకండరీ స్కూల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వెంకటేశ్వర్లు భూక్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. విద్యా విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో వెంకటేశ్వర్లు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

డాక్టరేట్ గ్రహీత రఘుకు సన్మానం



కాజీపేట రూరల్ / హన్మకొండ అర్బన్: ఓయు డాక్టరేట్ గ్రహీత సల్ల రఘును మాల మహానాడు, అంబేడ్కర్ సంఘాల నాయకులు కాజీపేట దర్గా అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం సన్మానించారు. మాల మహానాడు గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు అభినందించారు. మాల మహానాడు, అంబేడ్కర్ సంఘాల నాయకులు సింగారపు రవిప్రసాద్, కుసుమ్ముల్ల రవీందర్, సాదు కుమార్, హరినాథ్, హరిప్రసాద్, రంజిత్, రవి, చిన్న, వేణు, శిరీష్, రజిని పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని హంటర్ రోడ్డులోని ఎస్సీ (సీ) బాయ్స్ హాస్టల్‌లోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి భాగ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మచ్చ పవన్ తెలిపారు. హాస్టల్‌కు మహిళా వార్డెన్ ఉండటం వలన విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈక్రమంలో పురుష వార్డెన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ బాధ్యులు శ్రీకాంత్, వినయ్, రవికిరణ్, ప్రసాద్, రఘుకృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంపై అభ్యంతరాలు



హన్మకొండ అర్బన్: హనుమకొండ 49వ డివిజన్ పరిధిలోని రెవెన్యూకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం వివాదానికి దారితీసింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన స్థానిక కార్పొరేటర్ ఈ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారు కూడా తమకు ఆ పనితో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అయితే ఎన్నికల సమయంలో రూ.3 లక్షల సొంత ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ శివారు దూపకుంటలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలు గురువారం పరిశీలించినట్లు తెలిసింది. రంగులతో తీర్చిదిద్దిన డబుల్ బెడ్రూం ఇళ్లను చూసి వారు మురిసిపోయారు. 'ఇవేనా మాకు ఇచ్చే ఇళ్లు' అంటూ పెరకవాడకు చెందిన ఇల్లు లేని నిరుపేద మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే, అధికార పార్టీ ఎమ్మెల్యే గెలుస్తే ఇల్లు లేని వారికి ఇచ్చే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవేనని అక్కడి చేరుకున్న మహిళలకు ఓ నేత వివరించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో అక్కడికి లబ్ధిదారులు వెళ్లారని తెలుసుకున్నా పోలీసులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు.. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు వద్దకు చేరుకోగా అప్పటికే మహిళలు వెళ్లిపోయినట్లు సమాచారం.

పోలీసుల కౌన్సెలింగ్

హసన్‌పర్తి: కేయూ పరిధిలోని పలు ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు పోలీసులు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు బెల్ట్‌షాపులు నిర్వహించొద్దని చెప్పారు. ఒకవేళ బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే శిక్ష తప్పదని ఎస్సై రాజ్‌కుమార్ హెచ్చరించారు. బెల్ట్‌షాపులు నిర్వహించబోమని వారితో లిఖితపూర్వకంగా పత్రాలు తీసుకున్నారు.

క్రీడాకారులకు ఘన సన్మానం



అనూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు



క్రీడాకారులు, కోచ్‌ను అభినందిస్తున్న కుమారస్వామి



రామన్నపేట: క్రీడాకారులతో అధ్యాపకులు

మడికొండ: జాతీయ స్థాయి జూడో పోటీలకు మడికొండలోని బాలికల గురుకుల కళాశాల విద్యార్థి కే.అనూష ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో క్రీడాకారిణి అనూష, జూడో కోచ్ నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరితను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. గోవాలో ఈనెల 4నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి జూడో పోటీల్లో అనూష పాల్గొననున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ విద్యారాణి, జిల్లా కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

జూడో పోటీలకు గుడిబడి విద్యార్థినులు

కాశిబుగ్గ: జాతీయ స్థాయి జూడో పోటీలకు కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి)కు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈమేరకు నగరంలోని కెమిస్ట్రీ భవన్‌లో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూడో పోటీలో గుడిబడికి చెందిన వంకిడి సిరిచందన 27కిలోల విభాగంలో, సింగారపు మనస్విని 32కిలోల విభాగంలో విజేతలుగా నిలిచారని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కుమారస్వామి తెలిపారు. బలభద్ర హరిచరణ్, అజ్మీరా అక్షయ్, మునావత్ స్వాతి సిల్వర్ మెడల్స్, మంద సందేష్ బ్రాంజ్ మెడల్ సాధించారని వివరించారు. పాఠశాలలో క్రీడాకారులు, కోచ్ లింగమూర్తిని ఉపాధ్యాయులు సన్మానించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

రామన్నపేట: ఈనెల 3నుంచి 5వ తేదీ వరకు సిద్దిపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన వరంగల్ ఉమ్మడి జిల్లా బాలికల జట్టును ఏవీవీ అధ్యాపక బృందం వెంకటేశ్వర్లు, భుజేందర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్‌ఐ ఆర్గనైజింగ్ బరుపాటి గోపి శుక్రవారం అభినందించారు. వైష్ణవి, సంకీర్తన, సునీత, స్వప్న, సత్య, శ్రీశైలజ, మమత, స్పందన, దివ్య, కార్తీ, కీర్తన.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

కరీమాబాద్: ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్, వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా ఫిర్యాదుల కేంద్రం కీలక పాత్ర వహిస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా, మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. యువత సీ - విజిల్ యాప్‌ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసుచంద్ర, నోడల్ అధికారులు పుష్ప, భాగ్యలక్ష్మి, ఏఓ శ్రీకాంత్, ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్, కంట్రోల్ రూం, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- బీజేపీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి రావు పద్మ



రావు పద్మకు తిలకం దిద్దుతున్న మహిళ

హన్మకొండ: బీజేపీ నుంచి అభ్యర్థిగా ముందుకు వస్తున్నానని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి రావు పద్మ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని 58వ డివిజన్ ఇందిరానగర్, స్నేహనగర్, 7వ డివిజన్ బ్రాహ్మణవాడ, మచిలీబజార్‌లో ఆమె ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ కేసీఆర్ ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. కాకతీయ గడ్డపై కమలం పువ్వు జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి... మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుజ్జుల వసంత, నాయకులు పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలను లెక్కించాలి



మాట్లాడుతున్న అమిత్ ప్రతాప్ సింగ్

కరీమాబాద్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలన బృందాలు కచ్చితంగా లెక్కించాలని వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం వరంగల్ కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రావీణ్య, డీసీపీ రవీందర్, తూర్పు ఆర్‌ఓ రిజ్వాన్ బాషా, వర్ధన్నపేట ఆర్‌ఓ అశ్వినితానాజీ, నర్సంపేట ఆర్‌ఓ కృష్ణవేణితోపాటు అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా నోడల్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అభ్యర్థులు కూడా తమ ప్రచార వ్యయ ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికెట్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేస్తుందని వివరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కానుకలు, డబ్బు, మద్యం పంపిణీ నియంత్రణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎస్‌ఎస్‌టీలు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కాగా, ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. నిట్ అతిథిగృహంలో ఆయనను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

నరేందర్‌ను ఓడించడమే లక్ష్యం



వరంగల్ అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోందని, ఈ నేపథ్యంలో రౌడీ, కబ్జాదారుడు, ప్రజా వ్యతిరేకి అయిన ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బీం ఫారంను రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు, శాఫ్ డైరెక్టర్ రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు. నరేందర్‌ను ఓడించడమే తన లక్ష్యమని చెప్పారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2004లో తనకు నలుగురు గన్‌మెన్లను ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. నరేందర్‌కు బీఫారం కేటాయింపులో బీఆర్‌ఎస్ పార్టీ పునరాలోచించి, తనకు సీ ఫారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమ నియోజకవర్గంలో గెలుపు నాదే

- ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జంగా రాఘవరెడ్డి

కాజీపేట అర్బన్: రాబోవు ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో గెలుపు తనదేనని డీసీసీబీ మాజీ చైర్మన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జంగా రాఘవరెడ్డి అన్నారు. హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించి ముఖ్య కార్యకర్త ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధనలో ఉద్యమానికి కేయూ విద్యార్థులను పావుగా వాడుకుని వారిపైనే కేసులు పెట్టించిన దాస్యం వినయ్‌భాస్కర్, కేయూ భూములను అమ్ముకున్న నాయిని రాజేందర్‌రెడ్డి.. ఇద్దరూ దొంగలేనని ఆరోపించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న తనకు టికెట్ కేటాయింపుపై రాహుల్ గాంధీ పునరాలోచన చేయాలని కోరారు.



మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

మెప్మా ఆధ్వర్యంలో 'ఓటు'పై అవగాహన

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శంభునిపేట ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఓటు ఆవశ్యకతపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు విలువ గురించి జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్రాజెక్ట్ అధికారి కోలా రాజేష్‌కుమార్ వివరించారు. ఓటరు పోలింగ్ స్టేషన్‌ను ఏ విధంగా తెలుసుకోవాలో, ఓటును ఏ విధంగా వేయాలో వీడియో, ఆడియో ద్వారా అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకుంటామని సమావేశానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీడీపీఓ విశ్వజ, సీఓ ప్రవీణ్, ఆర్‌పీలు, ఓబీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న మహిళలు

మద్యం షాపుల్లో నిత్యం తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

కాజీపేట అర్బన్: ఎన్నికల నిబంధనల ప్రకారం అక్టోబర్ 9వ తేదీ నుంచి మద్యం షాపుల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నట్లు హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హనుమకొండ, హసన్‌పర్తి, ఎల్కుర్తి, కమలాపూర్ మండలాల్లో మద్యం షాపుల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 60మందిపై కేసులు నమోదు చేసి రూ.5 లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మద్యం అక్రమ విక్రయాలపై 1800 425 2523 టోల్ ఫ్రీ నంబర్, లేదా హనుమకొండ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ నంబర్ 87126 59019కు సమాచారం అందజేయాలని కోరారు.

కళాకారుడు ఏసోబుకు అభినందన

హన్మకొండ కల్చరల్: హసన్‌పర్తి మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి ఏసోబును వరంగల్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జానపద గిరిజన విజ్ఞాన పీఠం అనేక మంది జానపద కళాకారులను ప్రోత్సహిస్తోందని అన్నారు. చిందు యక్షగాన కళారంగానికి గజవెల్లి ఏసోబు చేసిన సేవలను కొనియాడారు. ఏసోబు మాట్లాడుతూ గతంలో ఉత్తమ కళాకారుడిగా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అవార్డులు, పొట్టి శ్రీరాములు వర్సిటీ ప్రతిభా పురస్కారం అందుకున్నానని వివరించారు.



ఏసోబును సన్మానిస్తున్న వెంకన్న, తదితరులు

ప్రపంచశాంతి కావాలి

హన్మకొండ: సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధాలు వద్దని, ప్రపంచశాంతి కావాలని పౌర ప్రజా సంఘాల ఐక్య వేదిక కో ఆర్డినేటర్ నల్లెల రాజయ్య కోరారు. పాలస్తీనా గాజాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ హనుమకొండలో పౌర ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం సాయంత్రం ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ఇజ్రాయిల్ - పాలస్తీనా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న బీభత్స యుద్ధాన్ని మాటల్లో చెప్పలేమని ఆందోళన వ్యక్తం చేశారు. దురాక్రమణ నీతిలో ఇజ్రాయిల్ ఎంతో శక్తివంతంగా మారి పాలస్తీనా దేశంలో నిత్యం వేలాది మంది చిన్నారులను చంపేయడం, భవనాలను కూల్చేయడం దారుణమని వాపోయారు. ఇజ్రాయిల్ చేస్తున్నది యుద్ధం కాదని దురాక్రమణ అని అన్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

హన్మకొండ: తెలంగాణ ప్రజల ఆరోగ్యాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సర్క్యూట్ హౌస్‌లోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి కార్యాలయంలో శుక్రవారం రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నాణ్యమైన వైద్యాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. రాష్ట్రంలో వైద్యరంగానికి సరిపోను బడ్జెట్‌ను కేటాయించడం లేదని వాపోయారు. లక్ష జనాభాకు పది బెడ్లు మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇచ్చిన జిల్లాకో సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి, అసెంబ్లీ నియోజకవర్గానికి 100 పడకల ఆస్పత్రి, మండలానికి 30 పడకల ఆస్పత్రి హామీ అమలు కాలేదని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సుధాకర్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్ - కడిపికొండ బ్రిడ్జి కింద ఉన్న వాషింగ్ లూప్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కాజీపేట జీఆర్పీ పోలీసులు శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాజీపేట జీఆర్పీ ఎస్సై ఐలయ్య వివరించారు. వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ లేదా 99594 25483 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

వరంగల్ క్రైం: ఎనిమిది నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ విభాగం (ఏహెచ్‌టీయూ) పోలీసులు తిరిగి తన కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. బాలుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాం, ఎస్సైలు ఫణీ, మల్లేశం, ఏఎస్సై భాగ్యలక్ష్మి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఏసీపీ అభినందించారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారిపై తెలంగాణ జంక్షన్ సమీపంలోని డీసీఎం వాహనాల పార్కింగ్ అడ్డా ప్రాంగణంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి రూ.12,780 నగదు, 9 సెల్‌ఫోన్లు, ప్లకార్డులు స్వాధీనం చేసుకుని తొమ్మిది మంది డ్రైవర్ల కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

11న మాదిగల విశ్వరూప మహాసభ

కాజీపేట రూరల్: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 11న జరగనున్న ఎస్సీల వర్గీకరణ మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ కోరారు. కాజీపేట బాపూజీనగర్‌లో ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు బండారి సురేందర్ అధ్యక్షతన శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

రేపు విశ్వబ్రాహ్మణ మహాజన సభ

కేయూ క్యాంపస్: ఈనెల 5న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సభ విజయవంతం చేయాలని జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కోశాధికారి డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్ కోరారు. విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ఉపాధ్యక్షుడు మారేడుగొండ బ్రహ్మయ్యతో కలిసి కాకతీయ యూనివర్సిటీలో కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు డాక్టర్ సుద్దాల విద్యాసాగర్, శ్రీరామోజు కృష్ణమూర్తి, బెజ్జంకి శ్రీనివాసచారి, పూసాల రామకృష్ణ పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కీలకం

హసన్‌పర్తి: ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులే కీలకమని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా బూత్‌ల్లోని ఓటర్లను బూత్ కమిటీ సభ్యులు కలుస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని సూచించారు.

స్పందించే నాయకుడు వినయ్‌భాస్కర్

హన్మకొండ: సమస్యలపై వెంటనే స్పందించే నాయకుడు దాస్యం వినయ్‌భాస్కర్ అని అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని హనుమకొండ నక్కలగుట్టలోని విష్ణు టవర్స్ లహరితో పాటు పలు అపార్ట్‌మెంట్లలో ప్రచారం నిర్వహించారు.

47వ డివిజన్‌లో ప్రచారం

కాజీపేట రూరల్: వరంగల్ పశ్చిమ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కాజీపేట 47వ డివిజన్‌లో పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. డివిజన్ 147వ బూత్ కెప్టెన్ గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వే రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. నాయకులు కాంపెల్లి లక్ష్మణ్, కొంకటి శరత్, గబ్బెట కరుణ్, గాజుల విజయ్, కొండేటి రోహిత్, మాలతి, విజయ, రేణుక పాల్గొన్నారు.

అరూరి రమేష్‌ను గెలిపించాలి

మడికొండ: వర్ధన్నపేట బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండలో కార్పొరేటర్ మునిగాల సరోజన, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, రాజు, రాసమల్ల వెంకటస్వామి, రాజు, కడమంచి మహేందర్, వల్లెపు ఉపేందర్, సాంబరాజు, రమేష్, విష్ణు, కల్యాణ్, రాకేష్, వినయ్, రోహిత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. 66వ డివిజన్‌లోని పలు కాలనీల్లో తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, పిట్టల కుమారస్వామి, నాయకులు బోడ యుగంధర్, యాదగిరి, గిన్నారపు రవీందర్ పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో బీజేపీ ప్రచారం

నయీంనగర్: కమలం పువ్వుకు ఓటు వేసి వరంగల్ పశ్చిమ బీజేపీ అభ్యర్థి రావు పద్మను గెలిపించాలని కోరుతూ 6వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చింతల రఘుపతి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మహిళలు, కార్యకర్తలతో కలిసి డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. రాజమౌళి, సంతోష్, పాశికంటి శ్రీనివాస్, సత్యప్రకాష్, మిర్యాల్‌కార్ సతీష్, నవజ్యోత్ బేడి, సురేంద్రనాథ్ గుప్త, అలంకి శ్యామ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

హసన్‌పర్తి: బీఆర్‌ఎస్ బహిష్కృత నేత, భారతీయ రాష్ట్ర సమితి 55వ డివిజన్ మాజీ అధ్యక్షుడు గడ్డం శివరాం శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కేఆర్.నాగరాజు ఆధ్వర్యంలో టీపీసీసీ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శివరాంతో పాటు దేవన్నపేట, గోపాలపురం, కోమటిపల్లి, భీమారానికి చెందిన నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కాజీపేట అర్బన్: కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో 31వ డివిజన్ న్యూశాయంపేటకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో పార్టీలో శుక్రవారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్‌భాస్కర్ సేవలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు సుందర్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, మాడిశెట్టి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నాయకుల భూదందాలు'

మడికొండ: బీఆర్‌ఎస్ పార్టీ అవినీతి, అక్రమాలు, భూ దందాలపై ప్రజలు విసుగు చెందారని మాజీ కార్పొరేటర్, కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్ అన్నారు. మడికొండలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం తథ్యం అని అన్నారు. పల్లపు అర్జున్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, బిల్ల శ్రీలత, నీలం వేణు, కుర్ల మోహన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ నాయకులు మేరుగు అశోక్, గడ్డం రవి అన్నారు. వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని సత్యనారాయణ స్వామి దేవాలయం లేన్‌లోని కార్మిక పరపతి సంఘం భవనంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో 35వ డివిజన్ బీఆర్‌ఎస్ రెబల్ కార్పొరేటర్ అభ్యర్థి మేరుగు అశోక్, నాయకులు గడ్డం రవి శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మేరుగు సుహాసిని, బేర కిషన్, గటికే రాంచందర్, ఎండీ.సలీం, మారపాక సతీష్, అంకతి అఖిల్, పిన్నిరెడ్డి ప్రణీత్, గుండెపు శివ, బొమ్మ అజయ్, గడ్డం దీక్షిత్, సాయి, చరణ్, శ్రీకాంత్, బండారి జ్యోతి, చింతం పద్మ, దాసు కీర్తన పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వరంగల్: వరంగల్ గ్రేటర్ 14వ డివిజన్ ఏనుమాముల, ఎస్‌ఆర్‌నగర్, సుందరయ్యనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను ఏనుమాముల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న తిరునహరి శేషు

హన్మకొండ: బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ఆరోపించారు. చిన్నాల యశ్వంత్ యాదవ్ అధ్యక్షతన హనుమకొండ సుబేదారిలో బీసీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీసీలకు అన్ని పార్టీల కంటే అతి తక్కువ స్థానాలను కేటాయించడమే కాకుండా, బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు చేయడం లేదని తూర్పారబట్టారు. బీసీల పట్ల తమ వైఖరిని కాంగ్రెస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు ధారబోయిన సతీష్, రమేష్, నరేందర్, జితేందర్ పాల్గొన్నారు.